క్లుప్తంగా

3 నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు



రాజరాజేశ్వరీ సమేత రామలింగేశ్వరస్వామి

జంగారెడ్డిగూడెం రూరల్: గురవాయిగూడెం రామలింగేశ్వరస్వామి క్షేత్రంలో అక్టోబర్ 3వ తేదీ నుంచి దుర్గా శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు వెంకట లక్ష్మీ నారాయణకుమార్ శర్మ తెలిపారు. ఆలయంలో కొలువై ఉన్న రాజేశ్వరీ అమ్మవారు అక్టోబర్ 3వ తేదీన బాలా త్రిపుర సుందరీదేవి, 4న గాయత్రి దేవి, 5న అన్నపూర్ణాదేవి, 6న లలితా త్రిపుర సుందరీ దేవి, 7న మహా చండీ దేవి, 8న మహాలక్ష్మీ దేవి, 9న సరస్వతీ దేవి, 10న శ్రీదుర్గాదేవి, 11న మహిషాసుర మర్దినీదేవి, మధ్యాహ్నం శ్రీవారాహిదేవి, 12న శ్రీరాజరాజేశ్వరీ అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారన్నారు. 10వ తేదీ ఉదయం 10 గంటల నుంచి అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని, 13న అమ్మవారి ఊరేగింపు నిర్వహిస్తామని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో అమ్మవార్ల స్నాన మహోత్సవం



అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక గానుగులపేట గంగానమ్మ, మహాలక్ష్మమ్మ, వినుకొండ వెంకమ్మ, పోతురాజు బాబుల వార్షిక స్నాన మహోత్సవం ఆదివారం ఉదయం వైభవంగా ప్రారంభమైంది. గణాచారులతో, మేళతాళాలతో, ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకొని స్నాన మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వందలాదిగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని కుంకుమ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. మధ్యాహ్నం విచిత్ర వేషధారణలు, డప్పు వాయిద్యాలు, నాట్యాలతో అమ్మ వారి ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. దారి పొడవునా అమ్మవారిని భక్తులు దర్శించుకుని పూజలు చేశారు.

సత్రంపాడులో ఉచిత మెగా దంత వైద్య శిబిరం



వైద్యులను సత్కరిస్తున్న వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): సత్రంపాడు వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం స్థానిక సత్రంపాడులో ఉచిత మెగా దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో డాక్టర్ దిరిసాల మధుచంద్ర, జాహ్నవి వైద్య సేవలు అందించారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ దిరిశాల వరప్రసాద్ ఆధ్వర్యంలో శిబిరంలో పాల్గొన్న సుమారు 60 మందికి ఉచిత వైద్య సేవలు, అవసరమైన వారికి మందులు అందజేశారు. అనంతరం వైద్య సేవలు అందించిన వైద్యులను వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. ఈ శిబిరంలో వాకర్స్ ఫాస్ట్ ఇంటర్నేషనల్ ఏవీపీ పీ. ఆంజనేయులు, క్లబ్ ప్రెసిడెంట్ ప్రసాద్, గౌరవ అధ్యక్షుడు కోటేశ్వరరావు, జిల్లా క్యాబినెట్ సర్వీస్ సెక్రటరీ ఆదినారాయణ, క్లబ్ సెక్రెటరీ, ట్రెజరర్, డైరెక్టర్లు పాల్గొన్నారు.

నేడు ఏలూరుకు స్పేస్ ఆన్ వీల్స్ బస్సు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): భారతీయ విజ్ఞాన మండలి, విజ్ఞాన భారతి, సైన్స్ సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సంయుక్త ఆధ్వర్యంలో భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) అంతరిక్ష మహాయాత్ర - స్పేస్ ఆన్ వీల్స్ బస్సు సోమవారం ఏలూరుకు వస్తోందని జిల్లా సమన్వయకర్త ఎస్. వెంకటేశ్వరరావు తెలిపారు. విద్యార్థినీ విద్యార్థులకు ఇస్రో కార్యకలాపాలు, భారత అంతరిక్ష మిషన్ సమాచారాన్ని అందించడం కోసం ఈ వాహనాన్ని స్థానిక సీఆర్ రెడ్డి పబ్లిక్ స్కూల్ ఆవరణలో అందుబాటులో ఉంచుతారన్నారు. సోమవారం ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 3గంటల వరకు ఈ వాహనం విద్యార్థులకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. స్పేస్ ఆన్ వీల్స్ వాహనంలో ఇస్రో నిర్వహించిన అంతరిక్ష యాత్రల సమాచారం, వివిధ ఉపగ్రహాల నమూనాలు, లాంచ్ ప్యాడ్స్ అంశాలు, ఇస్రో సాంకేతిక నిపుణులు విద్యార్థులకు వివరిస్తారు. ఈ మేరకు ఏలూరు పరిధిలోని ఆసక్తిగల పాఠశాలల, కళాశాలల విద్యార్థులందరూ ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఇతర వివరాలకు జిల్లా సమన్వయకర్త ఎస్.వెంకటేశ్వరరావును 8142035942 నంబర్‌కు సంప్రదించవచ్చన్నారు.

చల్లావారిగూడెంలో తాగునీటి కష్టాలు

- నిర్వాసితుల కాలనీలో మంచినీటి పైపులైన్లు ఏర్పాటు చేయని వైనం
- దూరప్రాంతాలకు వెళ్లి నీటిని తెచ్చుకుంటున్న ప్రజలు
- సమస్యను పరిష్కరించాలని వేడుకోలు



దూర ప్రాంతాల నుంచి తాగునీటిని తెచ్చుకుంటున్న కాలనీవాసులు



ఇంటిపై నుంచి కారే వర్షపు నీటి పట్టుకునేందుకు ఏర్పాటు చేసుకున్న పైపులైన్

జంగారెడ్డిగూడెం రూరల్: నిత్యం గోదావరి చెంతన ఉంటూ కావాల్సిన నీటిని అవసరాలకు వినియోగించుకుంటూ ప్రకృతి అందాల నడుమ జీవించిన పోలవరం మండలం తేకూరు ప్రజలు చుక్కనీటి కోసం నానా అవస్థలు పడుతున్నారు. నీటి కష్టాలు తీర్చండి మహాప్రభో అంటూ ప్రస్తుత ప్రభుత్వంలో అధికారులు, ప్రజాప్రతినిధుల వద్ద మొరపెట్టుకున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా తేకూరు ప్రాంతానికి చెందిన ప్రజలకు జంగారెడ్డిగూడెం మండలం తాడువాయి పంచాయతీ చల్లవారిగూడెంలో గృహాలు నిర్మించారు. ఇప్పటికే ఈ నిర్వాసిత కాలనీకి తేకూరు ప్రజలు వచ్చి జీవిస్తుండగా, అనేక మంది తరలిరావాల్సి ఉంది. ఈ కాలనీలో ప్రస్తుతం 40 కుటుంబాలు పైనే నివాసం ఉంటున్నారు. వీరు ఉంటున్న ప్రాంతంలో తాగునీటి సదుపాయం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. మంచినీటి కోసం నిర్వాసితులు దూర ప్రాంతాలకు నడిచి వెళ్లి పైపులు ఉన్న కుటుంబాల వారిని బతిమాలుకుని నీటిని తెచ్చుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. నీటి కష్టాలు ఈ కుటుంబాలకు వర్ణణాతీతంగా మారింది. పైపులైన్లు ఏర్పాటు చేసి తాగునీటిని అందించేలా చర్యలు చేపట్టాలని ఇక్కడ ప్రజలు అధికారులను, ప్రజాప్రతినిధులను వేడుకొంటున్నారు.

వర్షపు నీరే ఆధారంగా..

నిర్వాసిత కాలనీలో నీటి ఎద్దడి సమస్యతో వర్షపు నీరే ఆధారంగా మారింది. ఇంటి పైనుంచి కింద పడే వర్షపు నీటిని తాలూరి చినబాబు కుటుంబ సభ్యులు జాగ్రత్తగా ఒడిసి పట్టుకుంటున్నారు. చినబాబు తన ఇంటి పైకప్పు నుంచి కిందకు పడే వర్షపు నీటిని వృథా కానివ్వకుండా పైపులను ఏర్పాటు చేశారు. వర్షం నీటిని డ్రమ్ములలో పట్టుకుని వినియోగించుకుంటున్నారు. చిన బాబు చేపట్టిన ఈ ప్రయత్నం అభినందించాల్సిందే కానీ, నీటి ఎద్దడి కారణంగా ఈవిధంగా ఏర్పాటు చేసుకుని ఆధారపడాల్సి వచ్చిందే అనే ఆందోళన చెందాల్సిన అవసరం ఉంది.

తాగునీటి కష్టాలు తీర్చాలి



మా కాలనీకి మంచినీటి సరఫరా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. మంచినీళ్ల కోసం దూర ప్రాంతాలకు వెళ్లి తెచ్చుకోవాల్సిన పరిస్థితి. నిత్యం చుక్క నీటి కోసం నానా అవస్థలు పడుతున్నాం. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి తాగునీటి కష్టాలను తీర్చాలని వేడుకొంటున్నాం.

– రాజేశ్వరీ, నిర్వాసిత కాలనీ, చల్లవారిగూడెం

ఇబ్బందులు పడుతున్నాం



మంచినీళ్ల కోసం ఇబ్బందులు పడుతున్నాం. పైపులైన్లు ఏర్పాటు చేసి ప్రతి కుటుంబానికి తాగునీటిని అందించేలా చర్యలు తీసుకోవాలి. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తమ తాగునీటి కష్టాలను తీర్చాలని వేడుకొంటున్నాం. నీటి కోసం రోజూ కాళ్లు అరిగేలా నడిచి వెళ్లి తెచ్చుకునే పరిస్థితి ఎంతో ఇబ్బందులు కల్గిస్తున్నాయి. సమస్యకు పరిష్కారం చూపాలి.

– పోశమ్మ, నిర్వాసిత కాలనీ, చల్లవారిగూడెం

గుబ్బల మంగమ్మను దర్శించుకున్న భక్తులు



గుబ్బల మంగమ్మ దర్శనానికి వచ్చిన భక్తులు

బుట్టాయగూడెం: గుబ్బల మంగమ్మకు భక్తులు ఆదివారం మొక్కులు చెల్లించుకున్నారు. గత రెండు రోజులుగా కురుస్తున్న అడపాదడపా వర్షాలకు తక్కువమంది భక్తులు దర్శనానికి వచ్చినట్లు ఆలయ కమిటీవారు తెలిపారు. వాతావరణ మార్పుల కారణంగా మంగమ్మకు పూజలు చేసి మొక్కులు చెల్లించిన భక్తులను సాయంత్రం 3 గంటలకే తిరిగి వెళ్లాలని ఆలయ కమిటీవారు కోరారు.

2న జిల్లా ఉద్యమ అధ్యయన తరగతులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) ఏలూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా ఉద్యమ అధ్యయన తరగతులను అక్టోబర్ 2న ఏలూరులో నిర్వహించనున్నట్లు ఆ సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టీ.రామారావు, బీ. రెడ్డిదొర తెలిపారు. ఈ తరగతులలో రాష్ట్రీయ, జాతీయ, అంతర్జాతీయ పరిస్థితులు -విద్యారంగం పై ప్రభావం, విద్యారంగ సమస్యలు, ఏపీటీఎఫ్ దృక్పథం-పని విధానం అంశాలపై ఉపన్యాసాలు ఉంటాయన్నారు. వక్తలుగా తమ సంఘ రాష్ట్ర అధ్యక్షురాలు హెచ్.మంజుల, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.భాను మూర్తి, రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి పీ. పాండురంగ వరప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి బీపీ సాల్మన్ రాజు పాల్గొంటారని తెలిపారు.

మానవత సమావేశం

జంగారెడ్డిగూడెం: స్థానిక మానవత కార్యాలయంలో ఆదివారం సంస్థ నెలవారి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మానవత సభ్యులు మాట్లాడుతూ ప్రస్తుతం 500 సభ్యత్వాలు నమోదయ్యాయని, అక్టోబర్ 10 నాటికి మరో 500 సభ్యత్వాలు చేయాలని తీర్మానించినట్లు తెలిపారు. సమావేశం అనంతరం కొత్తపేటలో ఉంటున్న అహ్మద్ భాష ఇటీవల కొవ్వూరు గోదావరిలో ప్రమాదవశాస్తూ మృతిచెందడటంతో ఆయన భార్యకు మానవతా సంస్థ ఆధ్వర్యంలో అల్లు రామకృష్ణ రూ. 5000, ఈసీ సభ్యులు మొగల్జీడి శ్యామ్ రూ. 5000ను అందజేశారు. మానవత సభ్యులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



జంగారెడ్డిగూడెంలో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

జంగారెడ్డిగూడెం: రౌడీషీట్లు కలిగిన వారు సత్ప్రవర్తనతో మెలిగాలని జంగారెడ్డిగూడెం సీఐ కృష్ణబాబు సూచించారు. జంగారెడ్డిగూడెం పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీషీటర్లకు, గత కేసులలో అనుమానాస్పద వ్యక్తులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలిగితే రౌడీషీట్లు ఎత్తివేసేందుకు అధికారులకు సిఫార్సు చేస్తామన్నారు. అలాగే గత కేసులలో నిందితులు, అనుమానాస్పద వ్యక్తులపై నిఘా కొనసాగుతుందని తెలిపారు. కావున, రౌడీషీటర్లుగా నమోదైన వారు గాని, అనుమానాస్పద వ్యక్తులుగా పోలీసు రికార్డుల్లో ఉన్న వారు గాని ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడవద్దని, అందరికి ఆదర్శంగా ఉండేలా మెలగాలని సూచించారు. ఒక వేళ ఎవరైనా అసాంఘిక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జంగారెడ్డిగూడెం సర్కిల్ పరిధిలో అసాంఘిక కార్యక్రమాలపై ప్రత్యేక నిఘా పెట్టామని, ఎక్కడ ఎటువంటి ఘటన చోటు చేసుకున్నా ఉక్కుపాదంతో అణిచివేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై షేక్ జబీర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బ్రాహ్మణ పరిషత్ ఆత్మీయ సమావేశం



జంగారెడ్డిగూడెంలో ప్రాంతీయ బ్రాహ్మణ పరిషత్ ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం ప్రాంతీయ బ్రాహ్మణ పరిషత్ ఆత్మీయ సమావేశం ఆదివారం అధ్యక్షుడు చిలుకూరి సాయిబాబ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. బ్రాహ్మణ కమ్యూనిటీ భవన నిర్మాణానికి అందరూ సహకరించాలని కోరారు. అలాగే నవంబర్ 10న బ్రాహ్మణ కార్తీక వనసమారాధన జరుగుతుందని, బ్రాహ్మణులకు ఆహ్వానాలు పంపిస్తామన్నారు. అధిక సంఖ్యలో బ్రాహ్మణులు పాల్గొనేలా సభ్యులు చర్యలు తీసుకోవాలన్నారు. కాగా, ఎన్‌డీఏ కూటమి నామినేటెడ్ పోస్టుల్లో బ్రాహ్మణులకు సముచిత స్థానం కల్పించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ పురోహిత బ్రాహ్మణ సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి సుదర్శనం దుర్గబాబు, ప్రాంతీయ బ్రాహ్మణ పరిషత్ కార్యదర్శి కూచిభట్ల రాము, ఉపాధ్యక్షులు నిడుమోలు చిరంజీవి రావు, వెలివెల పెద్దిరాజు, ఉప కార్యదర్శి కూచి త్రినాధ రావు, లక్ష్మీ, మదనంబేడి కృష్ణప్రియ, సుబ్బారావు, చిలుకూరి లక్ష్మీనారాయణ, జూలూరి ప్రఫుల్లా, బట్టు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

200 మంది రోగులకు వైద్యసేవలు



కిడ్నీ రోగి రోశయ్యకు ఆర్థిక సాయం అందజేస్తున్న మానవత సభ్యులు

చింతలపూడి: రేచర్ల గ్రామంలో మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డా ఎ సత్యన్నారాయణ, డా కె అనిల్, డా జి దీప్తి, డా కె సురేంద్రబాబు రోగులకు పరీక్షలు జరిపారు. శిబిరంలో 200 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా కళ్లజోళ్లు అందించారు. టీఎస్‌రావుపేటకు చెందిన కిడ్నీ రోగి ఎం రోశయ్యకు మానవత రూ.5 వేలు, సాయి రాఘవేంద్ర మెడికల్స్ యజమాని కె శ్రీనివాసరావు రూ.2 వేలు కలిపి మొత్తం రూ.7 వేలు అందజేశారు. కార్యక్రమంలో మానవత గౌరవ డైరెక్టర్ ఎ సత్యన్నారాయణ, జిల్లా సహాయ కార్యదర్శి పి సోమశేఖర్, చైర్మన్ ఎ అప్పారావు, కన్వీనర్ అధ్యక్షుడు కె రాజేశ్వరి, కె నాగ చిన్నారావు, ఎస్ అశోక్‌బాబు, ఎ రాజారావు, కె రామకృష్ణారెడ్డి, వై శ్రీనివాసరావు, డి సురేష్, రేచర్ల సర్పంచ్ శివరామకృష్ణ, మాజీ సర్పంచ్ టి వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోర్సవారిగూడెంలో పాఠశాలను పునఃప్రారంభించాలి



పాఠశాలను ప్రారంభించాలని కోరుతున్న రామకృష్ణ, గ్రామస్తులు


బుట్టాయగూడెం: బుట్టాయగూడెం మండలం మారుమూల ప్రాంతంలోని కోర్సవారిగూడెంలో మూతపడిన పాఠశాలను తిరిగి పునఃప్రారంభించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు తెల్లం రామకృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గిరిజన సంఘం బృందం కోర్సవారిగూడెం గ్రామాన్ని సందర్శించడం జరిగిందని అన్నారు. ఆ సమయంలో ఆ గ్రామంలో 25 మంది గిరిజన విద్యార్థులు ఇనుమూరు, గవరవరం, గురుగుమిల్లి, పందిరిమామిడిగూడెం వంటి దూరప్రాంతాలకు వెళ్లి చదువుకుంటున్నారని చెప్పారు. వారికి అందుబాటులో ఉండేవిధంగా కోర్సవారిగూడెంలో మూతపడిన పాఠశాలను మళ్లీ తిరిగి ప్రారంభించాలని కోరారు. గ్రామస్తులు కె. గాంధీ, ముత్యాలు, సోమిరెడ్డి, తదితరులు ఆయన వెంట ఉన్నారు.

దసరాకు దుర్గమ్మలు సిద్ధం



జంగారెడ్డిగూడెంలో సిద్ధంగా ఉన్న అమ్మవారి విగ్రహాలు

జంగారెడ్డిగూడెం: దసరా ఉత్సవాలకు దుర్గమ్మలు సిద్ధమయ్యారు. అతిపెద్ద పండుగల్లో ఒకటైన దసరా మహోత్సవాలు నిర్వహించేందుకు నిర్వాహకులు సమాయత్తమయ్యారు. దీనికి అనుగుణంగా ఆయా పందిళ్లల్లో దుర్గమ్మను నెలకొల్పేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో వ్యాపారులు సైతం దుర్గమ్మ విగ్రహాలను సిద్ధం చేశారు. వివిధ ఆకృతులలో, వివిధ సైజుల్లో దుర్గమ్మ విగ్రహాలను రమణీయంగా తయారు చేసి అమ్మకానికి ఉంచారు. సుమారు రూ.5 వేల నుంచి రూ.25 వేల వరకు విగ్రహాల ధరలను నిర్ణయించారు. ఈ సందర్భంగా వ్యాపారులు మాట్లాడుతూ వినాయక చవితికి విగ్రహాల డిమాండ్ ఎలా ఉంటుందో, దసరాకు సైతం అంతే డిమాండ్ ఉంటుందని, దానికి అనుగుణంగా దుర్గమ్మ విగ్రహాలను తయారు చేసినట్లు చెప్పారు. జంగారెడ్డిగూడెం జేపీ సెంటర్, హైస్కూల్ సెంటర్‌లలో అమ్మవారి విగ్రహాలను అమ్మకానికి ఉంచారు.



పంచముఖ దుర్గమ్మ



కనకదుర్గమ్మ



నెమలి సింహాసనంపై దుర్గమ్మ తల్లి

'ఆదివాసీ' నేతల నిరసన



చంద్రమ్మకాలనీలో నిరసన వ్యక్తం చేస్తున్న ఏఎస్‌పీ నాయకులు

బుట్టాయగూడెం: గిరిజన ప్రాంతంలో 1/70 చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు కాకి మధు అన్నారు. జీలుగుమిల్లి మండలం చంద్రమ్మకాలనీలో ఆ సంఘ నాయకులు పూనెం వెంకటేశ్వరరావు అధ్యక్షతన ఆదివారం అత్యవసర సమావేశం నిర్వహించారు. అనంతరం నేతలు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ నకిలీ సర్టిఫికెట్‌లను సృష్టించే రెవెన్యూ అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కంచే చేను మేసినట్లుగా చట్టాలను అమలు చేయాల్సిన అధికారులే ఆ చట్టాలకు తూట్లు పొడుస్తున్నారని విమర్శించారు. గిరిజన ప్రాంతంలో మరో భూ ఉద్యమానికి ఆదివాసీలు సిద్ధమవుతున్నారని దానికి జరిగే పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘ నాయకులు రవ్వా బసవరాజు, పండు రాజేంద్ర, పండు జగదీష్, నారం శంకరరావు, తెల్లం ప్రసాద్, కొండయ్య, తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశం అనంతరం నకిలీ సర్టిఫికెట్‌లు సృష్టిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని నిరసన వ్యక్తం చేస్తూ నినాదాలు చేశారు.

జిల్లా స్థాయి పోటీలకు గురుకుల విద్యార్థినుల ఎంపిక



పోటీలకు ఎంపికైన బాలికలతో ఉపాధ్యాయులు

చింతలపూడి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 2024-25 విద్యా సంవత్సరానికి జరిగిన ఆటల పోటీల్లో మండలంలోని నాగిరెడ్డిగూడెం బాలికల గురుకుల పాఠశాల బాలికలు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల తణుకు, ఏలూరు, పెదవేగి, జంగారెడ్డిగూడెం పట్టణాల్లో ఎంపిక పోటీలు నిర్వహించారు. అండర్ -17, అండర్-14 పోటీల్లో యోగా, బాడ్మింటన్, 200, 600 మీటర్ల రన్నింగ్, షాట్ పుట్, లాంగ్ జంప్, హై జంప్, సాఫ్ట్‌బాల్, బేస్ బాల్ పోటీల్లో సత్తాచాటి మొత్తం పాఠశాల నుంచి 34 మంది జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎం బ్రాహ్మణేశ్వరమ్మ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాస్థాయికి ఎంపికైన విద్యార్థినులను, పీఈటీ బాల భారతిలను ఉపాధ్యాయులు కె లక్ష్మీకుమారి, జె అనిల్‌కుమార్ అభినందించారు.

ఉచిత గుండె వైద్య పరీక్ష శిబిరం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం, ఏలూరు లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి సత్రంలో ఉచిత గుండె వ్యాధి శిబిరం నిర్వహించారు.హైదరాబాద్‌కు చెందిన కాంటినెంటల్ హాస్పిటల్స్, ఏలూరు సిరి సూపర్ స్పెషలిస్ట్ హాస్పిటల్ డాక్టర్ ప్రసన్నకుమార్ సహకారంతో ఉదయం పది నుంచి, ఈదర సుబ్బమ్మ దేవి హైస్కూల్ ప్రాంగణంలోనూ ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుండె వ్యాధులకు సంబంధించిన టెస్టులు, రక్త పరీక్షలు, ఈసీజీ, ఈకో వంటి పరీక్షలు ఉచితంగా నిర్వహించి అవసరమైన ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వాసవి సుబ్బారావు, ఎం.చలపతి రావు, మానేపల్లి రామారావు, చందులూరి సుధీర్, పీ రత్నకుమార్, పీ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ తగదు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో అక్టోబర్ 1న నిర్వహించనున్న నిరాహార దీక్ష కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయా సంఘల నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక పీడీఎస్‌యూ కార్యాలయంలో పీడీఎస్‌యూ, పీవైఎల్, ఎస్ఎఫ్ఐ, ఐవైసీ, వైఎస్ఆర్ స్టూడెంట్ యూనియన్, పీఎస్ఎఫ్ఐ నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పీడీఎస్‌యూ నగర అధ్యక్షుడు ఎం .క్రాంతి అధ్యక్షత వహించారు. నాయకులు మాట్లాడుతూ లాభాల బాటలో ఉన్న విశాఖ ఉక్కు పరిశ్రమను బీజేపీ ప్రభుత్వం తన అనుయాయులకు అప్పనంగా కట్టబెట్టడం కోసం ప్రైవేట్ పరం చేస్తోందని దీన్ని అందరూ ఖండించాలని కోరారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఈ చర్యను అడ్డుకోకపోవడం దుర్మార్గమన్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఎన్నికలకు ముందు విశాఖ ఉక్కు పరిశ్రమ పరిరక్షణ కోసం పాటుపడతామని ఎట్టి పరిస్థితుల్లో ప్రైవేటీకరణ కానీయమని చెప్పి అధికారం చేపట్టిన తర్వాత ఎన్డీఏ ప్రభుత్వంలో భాగస్వామిగా ఉండి నోరు మెదపకపోవడం సిగ్గుచేటన్నారు. తిరుపతి లడ్డూ గురించి గగ్గోలు పెట్టే రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రులకు వేలాది మందికి అన్నం పెట్టే విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ ఆపాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఎందుకు అడగలేక పోతున్నారని ప్రశ్నించారు. ఈ నెల 28న నాలుగు వేల మంది కాంట్రాక్ట్ కార్మికుల ఉద్యోగాలు తీసేస్తున్నట్టు ప్రకటించడం దుర్మార్గమని, వారందరినీ యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు.